# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 04-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- భారతదేశ పర్యటన నిమిత్తం రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ కొద్ది సేపటి క్రితం ఢిల్లీ చేరుకున్నారు.
- సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు-2025కు రాజ్యసభ ఆమోదం తెలిపింది.
- బాల్య వివాహ రహిత భారత్ కోసం 100 రోజుల ప్రచార కార్యక్రమాన్ని కేంద్రమంత్రి అన్నపూర్ణా దేవి ఈరోజు ప్రారంభించారు.
- గిగ్ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడానికి లేబర్ కోడ్స్ దోహదపడతాయని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ పర్యటన నిమిత్తం రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ కొద్ది సేపటి క్రితం ఢిల్లీ చేరుకున్నారు. ఢిల్లీ పాలం విమానాశ్రయంలో దిగిన పుతిన్ కు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వాగతం పలికారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా రేపు జరగనున్న భారత్ - రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో ఇరువురు పాల్గొంటారు. ఇంధనం, పరిశ్రమలు, అంతరిక్షం, వ్యవసాయం తదితర రంగాల్లో అనేక ఉమ్మడి ప్రాజెక్టులు పూర్తి చేసుకోవడమే లక్ష్యంగా ఇరు దేశాలు పలు కీలక ఒప్పందాలు చేసుకోనున్నాయి. అదే విధంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ గౌరవార్థం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు విందును ఏర్పాటు చేస్తారు.

= = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో రాజ్యసభ ఈరోజు సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు 2025 కు ఆమోదం తెలిపింది. 1944లోని సెంట్రల్ ఎక్సైజ్ చట్టాన్ని సవరించడం ఈ బిల్లు లక్ష్యంగా పెట్టుకుంది. ప్రత్యేకంగా సిగరెట్లు, హుక్కా, పొగాకు, జర్దా వంటి పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాలు, సెస్‌లను పెంచడానికి ఈ సవరణ అవసరమని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ...

(వాయిస్ 29 సెకన్లు)

అంతకుముందు విపక్షాలు లేవనెత్తిన అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సుముఖంగా లేదని ప్రతిపక్ష నాయకుడు మల్లిఖార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలకు కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జె పి నడ్డా స్పందిస్తూ.. పార్లమెంటులో ప్రతి అంశంపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న అంశాలపై చర్చను తప్పించుకోవట్లేదని స్పష్టం చేశారు. ఇక లోక్ సభ ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖా మంత్రి జుయెల్ ఓరం మాట్లాడుతూ.. ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కింద దేశ వ్యాప్తంగా గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 80 వేల కోట్ల రూపాయలు  కేటాయించిందని చెప్పారు. మరొక ప్రశ్నకు కేంద్ర రోడ్లు, రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ సామాధానమిస్తూ... 2030 నాటికి భారతదేశ విద్యుత్ వాహన మార్కెట్ వృద్ధి 20 లక్షల కోట్ల రూపాయలకు చేరుకుంటుందని సభకు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచంలో అస్థిరత్వం నెలకొన్నప్పటికీ భారత్-రష్యా దేశాల మధ్య సంబంధాలు సానుకూల వాతావరణంలోనే కొనసాగుతున్నాయని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 22వ భారత్-రష్యా సైనిక, సాంకేతిక సహకారం అంతర్ ప్రభుత్వ కమిషన్ మంత్రివర్గ సమావేశానికి రష్యా రక్షణ శాఖ మంత్రి ఆండ్రీ బెలౌసోవ్ తో కలిసి రాజ్ నాథ్ సింగ్ సహ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రష్యా భారత్ కు ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామి అని అభివర్ణించారు. ఇక రష్యా రక్షణ మంత్రి ఆండ్రీ బెలౌసోవ్ మాట్లాడుతూ... భారతదేశం - రష్యా సంబంధాలు పరస్పర గౌరవం, స్నేహంతో మరింతగా పెరిగాయని అన్నారు. భారతదేశంతో భాగస్వామ్యం దక్షిణాసియా ప్రాంతంలో సమతుల్యతకు ప్రపంచ భద్రతకు కీలకమని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారతదేశపు మొట్ట మొదటి మానవ సహిత అంతరిక్ష మిషన్ గగన్‌యాన్ విషయంలో ఇస్రో సంసిద్ధతను ఇటీవల విజయవంతమైన ఇంటిగ్రేటెడ్ మెయిన్ పారాచూట్ ఎయిర్‌డ్రాప్ టెస్ట్ (ఐఎంఏటీ) చాటి చెప్పిందని కేంద్ర అంతరిక్ష శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. లోక్ సభలో ఈరోజు ఆయన ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ... గగన్‌యాన్ కు సంబంధించి అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలను దృష్టిలో పెట్టుకొని ఇస్రో చేపట్టిన ఎక్స్ ట్రీమ్-కండిషన్ పారాచూట్ పరీక్ష విజయవంతంతో గగయాన్ మిషన్‌ను 2027 మొదటి త్రైమాసికంలో చేపట్టాలన్న ప్రణాళికను యధావిధిగా కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఐఎంఏటీతో సహా ప్రధాన పరీక్షల ఫలితాలను తరచుగా ఇస్రో ప్రకటిస్తోందన్నారు. ఈ మానవ సహిత అంతరిక్ష యాత్ర పురోగమిస్తున్న కొద్దీ ఇస్రో ప్రజలకు సమాచారం అందిస్తూనే ఉంటుందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

బాల్య వివాహ ముక్త్ భారత్ ప్రచారం మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 100 రోజుల ప్రత్యేక అవగాహన ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖా మంత్రి అన్నపూర్ణా దేవి ఈరోజు న్యూఢిల్లీలో ప్రారంభించారు. బాల్య వివాహాలను నిర్మూలించేందుకు దేశ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, ప్రతీ ఒక్కరూ బాల్య వివాహ ముక్త్ భారత్ కోసం తమ వంతు అవగాహన కల్పించాలని కోరారు.

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

గిగ్ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడానికి లేబర్ కోడ్స్ దోహద పడతాయని కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన భారతదేశం-రష్యా వాణిజ్య వేదిక నుంచి గోయల్ ప్రసంగిస్తూ కార్మికులకు మెరుగైన ఒప్పందాలు లభించడం, మెరుగైన జీతాలు, అధిక జాతీయ కనీస వేతనాల కల్పనకు సరళీకృతం చేసిన కార్మిక చట్టాలు ఉపయోగపడతాయని అన్నారు. కాంట్రాక్టు కార్మికుల సామాజిక భద్రతకు కూడా ఇవి  భరోసా కల్పిస్తాయని ఆయన పేర్కొంటూ..

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

నౌకాదళ దినోత్సవం సందర్భంగా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (CDS) జనరల్ అనిల్ చౌహాన్ నౌకాదళ ప్రధానాధికారి అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి ఈరోజు న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. భారత నావికాదళం సాధించిన విజయాలు, పాత్రను గుర్తించడానికి ప్రతి సంవత్సరం డిసెంబర్ 4వ తేదీన నౌకాదళ దినోత్సవాన్ని జరుపుకుంటాం. 1971లో ఇదే రోజున, ఆపరేషన్ ట్రైడెంట్ పేరిట భారత నావికాదళం PNS ఖైబర్ సహా నాలుగు పాకిస్తాన్ నౌకలను ముంచివేసింది. సైకాదళ దినోత్సవం సందర్భంగా భారత నావికాదళ సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ “ఫిచ్” 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ భారతదేశ జిడిపి వృద్ధి అంచనాను 7.4 శాతానికి సవరించింది. గతంలో 6.9 శాతంగా ఉంటుందని అంచనా వేసిన ఈ రేటింగ్ ఏజెన్సీ ఇటీవలి పన్ను సంస్కరణల సానుకూల ప్రభావంతో పాటూ బలమైన ప్రైవేట్ వినియోగం కారణంగా జిడిపి వృద్ధి అంచనాను సవరించామని పేర్కొంది.  వస్తు సేవల పన్ను (జిఎస్టి) 2.0 సంస్కరణల ప్రయోజనాల ద్వారా ప్రైవేట్ వినియోగదారుల వ్యయం వృద్ధికి ప్రాథమిక చోదకంగా కొనసాగుతుందని ఫిచ్ రేటింగ్ ఏజెన్సీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

రాజస్థాన్, పంజాబ్, చండీగఢ్, హర్యానా, ఢిల్లీలలో రాబోయే రెండు రోజుల పాటు చలిగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. హిమాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, ఒడిశా రాష్ట్రాలలో శనివారం వరకు దట్టమైన పొగమంచు పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని IMD వెల్లడించింది. తమిళనాడు, కారైకల్, కేరళ, మాహే, పుదుచ్చేరిలలో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 85 వేల 106 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై... చివరికి 158 పాయింట్ల లాభంతో 85 వేల 264 వద్ద ముగిసింది.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =